సాక్షి
నల్లగొండ
గురువారం । 6 । మార్చి । 2025



బీజేపీపై పోరాటం చేయాలి
రాష్ట్రానికి ప్రమాదకరంగా మారబోతున్న బీజేపీపై పోరాడాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరభద్రం అన్నారు. - 8లో



బుద్ధవనాన్ని సందర్శించాలి
బుద్ధవనాన్ని సందర్శించాలని నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సెక్రటరీ ఆర్‌కే మిశ్రా అన్నారు. - 8లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-29 (గురువారం సా॥)
సహర్ 5-08 (శుక్రవారం ఉ॥)




నల్లగొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ కళాశాలలో విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది, పరీక్ష రాస్తున్న ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు 619 మంది గైర్హాజరు

నల్లగొండ: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ఫస్టియర్ తెలుగు, హిందీ, అరబిక్, సంస్కృతం పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు జరిగాయి. జిల్లావ్యాప్తంగా 14,685 మంది పరీక్షలకు హాజరు కావాల్సిఉండగా 14,066 మంది హాజరయ్యారు. 619 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయసంఘటనలు చోటుచేసుకోలేదని డీఐఈఓ దస్రు నాయక్ పేర్కొన్నారు.

గ్లాకోమా పరీక్ష చేయించుకోండి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- కనగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్లాకోమా సెంటర్ ప్రారంభం

కనగల్: కంటి వ్యాధుల నిర్ధారణకే కనగల్ మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గ్లాకోమా(కంట్లో నీటి కాసులు) సెంటర్ ఏర్పాటు చేయించానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం కనగల్‌లోని పీహెచ్‌సీ నూతన భవనంతోపాటు గ్లాకోమా సెంటర్ మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహీంద్రా యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ లైఫ్ సైన్స్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అధ్యయనం చేస్తున్న డాక్టర్ బిపిన్ తనను కలిసి వివరించి ఇక్కడ గ్లాకోమా సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కంటి పరీక్షలకు కావాల్సిన అన్ని పరికరాలను ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా అందించామని, ఇంకేమైనా కావాల్సి ఉంటే అందిస్తామన్నారు. కంటి వ్యాధుల నిర్ధారణకు సంబంధించి జిల్లాలోనే మొదటిసారిగా కనగల్ పీహెచ్‌సీలో గ్లాకోమా సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని 40 ఏళ్లు నిండిన మహిళల్లో కంటిచూపును ప్రభావితం చేసే గ్లాకోమా సమస్య తీవ్రంగా ఉంటుందని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని మంత్రి సూచించారు. మరో 30 రోజుల పాటు మండలంలో కంటి పరీక్షలు నిర్వహించి ఆ తర్వాత జిల్లా మొత్తం చేయాలన్నారు. అవసరమైన వారందరికీ కంటి అద్దాలు కూడా అందిస్తామని తెలిపారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న మంత్రి

రోడ్ల అభివృద్ధికి నిధులు
కనగల్ నుంచి నాగార్జునసాగర్ హైవే కలిపే విధంగా రూ.15 కోట్లతో రోడ్డుకు టెండర్లు పిలిచామన్నారు. కనగల్ మండలంలోని రోడ్ల అభివృద్ధికి రూ.60 కోట్లు మంజూరు చేశామన్నారు. కనగల్, తిప్పర్తి మండలాలకు జూనియర్ కళాశాలలు మంజూరయ్యాయని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యంపై నమ్మకం కలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డాక్టర్ సుపర్ణ, మహేంద్ర, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, టీజీ ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జైపాల్‌రెడ్డి, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివశంకర్‌రెడ్డి, కనగల్ పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, మందడి రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింగ్ సునీత కృష్ణయ్యగౌడ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

10 నుంచి 'పోరుబాట'



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

మిర్యాలగూడ అర్బన్: రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 10వ తేదీ నుంచి పోరుబాట కార్యక్రమం నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10 తేదీన అన్ని గ్రామాలు, పట్టణాల్లో ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా సంతకాల సేకరణ చేపట్టాలన్నారు. 15వ తేదీ వరకు అన్ని గ్రామాలు, పట్టణాలలో దోళనలు చేపట్టాలన్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో 24, 25, 26 తేదీల్లో రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని కోరారు. 27న జిల్లా కేంద్రంలో మహాధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతంరెడ్డి, భావండ్ల పాండు, అరుణ, కోడిరెక్క మల్లయ్య, పల్లా భిక్షం, కరిమున్నీషాబేగం, శ్రీను, వెంకన్న, రామారావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో బుధవారం ఎంజీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో హెచ్ఐవీపై రెడ్ రిబ్బన్ క్లబ్ పీర్ లీడర్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. లీడర్స్‌కు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి, ప్రిన్సిపాల్ ఎస్.ఉపేందర్, రిసోర్స్ పర్సన్ నరసింహారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ మల్లేశం, సావిత్రి, శివరాణి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కృషి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కృష్ణవేణి, టీఎన్జీఓ నాయకులు

నల్లగొండ టౌన్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషిచేస్తానని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కేవీ.కృష్ణవేణి అన్నారు. బుధవారం నల్లగొండలోని టీఎన్జీఓ కార్యాలయంలో జిల్లా అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి, అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ నామిరెడ్డి నిర్మల, జిల్లా అధ్యక్షురాలు జొన్నలగడ్డ వెంకటరమణ, కార్యదర్శి మజ్జిగపు సునీత, కోశాధికారి పుట్ట సునీత, సీడీపీఓ మమత, అసోసియేషన్ ప్రెసిడెంట్ శశికళ, కుర్షితా బేగం తదితరులు పాల్గొన్నారు.

హనీ ట్రాప్ దోపిడీ!

వీడియో కాల్స్ లిఫ్ట్ చేస్తే ఇక అంతే..

- బాధితులు ఎక్కువ.. ఫిర్యాదులు జీరో
- పరువుపోతుందని ఫిర్యాదు చేసేందుకు వెనుకడుగు
- ఎమ్మెల్యే వీరేశంకు న్యూడ్ కాల్ చేసిన మోసగాళ్లు
- కాల్ కట్ చేయడంతో బెదిరింపులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన నకిరేకల్ ఎమ్మెల్యే



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాలో పలువురు హనీ ట్రాప్(వలపు వల)లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఏటా వందల మంది హనీ ట్రాప్ బారిన పడుతున్నారు. బ్లాక్‌మెయిలింగ్‌తో డబ్బుల వసూళ్లకు అలవాటుపడిన సైబర్ మోసగాళ్లు అమ్మాయిలతో న్యూడ్ కాల్స్ చేయిస్తూ బాధితులను బెదిరిస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు. వీడియో కాల్ రాగానే అనుకోకుండా లిఫ్ట్ చేస్తే, స్క్రీన్ షాట్లు తీసుకొని బెదిరింపులకు పాల్పడుతున్నారు. తాజాగా మంగళవారం రాత్రి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంకు న్యూడ్‌గా ఉన్న అమ్మాయితో వీడియో కాల్ చేయించి నేరగాళ్లు బెదిరింపులకు దిగారు. ఆయన వెంటనే ఆ వీడియో కాల్ కట్ చేయడంతో అప్పటికే నేరగాళ్లు తీసిన స్క్రీన్‌షాట్‌ను ఎమ్మెల్యేకే పంపించి బెదిరింపులకు దిగారు. డబ్బులు ఇవ్వకపోతే పార్టీ నేతలకు, కార్యకర్తలకు ఆ వీడియో పంపిస్తామని బెదిరించారు. దీనిపై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

పరువు పోతుందనే భయంతో..
తెలియని ఫోన్ నెంబర్ల నుంచి వీడియో కాల్ వచ్చినప్పుడు అనుకోకుండా లిఫ్ట్ చేసి అనేక మంది తంటాలు పడుతున్నారు. నేరగాళ్లు అడిగిన డబ్బులు ఇవ్వకపోతే సోషల్ మీడియాలో పోస్టు చేస్తామని, బంధువులు, కుటుంబ సభ్యులకు పంపిస్తామని బెదిరించి బాధితుల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. అయితే ఈ సంఘటనలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేయడం లేదు. ఫిర్యాదు చేస్తే తమ పేరు బయటికి వస్తుందేమోనని, పరువుపోతుందని భయపడి ఫిర్యాదుకు వెనుకాడుతున్నారు. అడిగిన మేరకు డబ్బులు ఇచ్చి మోసపోతున్నారు. గడిచిన ఏడాది కాలంలో ఇలాంటి సంఘటనలు 100 వరకు తమ దృష్టికి వచ్చాయని, అయితే ఫిర్యాదు చేసేందుకు మాత్రం వెనుకాడుతున్నారని ఓ పోలీసు అధికారి పేర్కొన్నారు. వీడియో ఫోన్ కాల్ రావడంతో అనుకోకుండా లిఫ్ట్ చేసి, అడిగినంత నేరగాళ్లకు ముట్టజెప్పి ఆర్థికంగా ఇబ్బందుల్లో కూరుకుపోయిన వారు ఉన్నారని వెల్లడించారు.

అనేక రకాలుగా దోపిడీ..
తక్కువ పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఇస్తామని ఓవైపు దోచుకుంటున్న సంఘటనలు అనేకం రిపోర్టు అవుతున్నాయి. వాటిపై బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు. ఏపీకే ఫైల్స్ పంపించి వాటిని క్లిక్ చేయగానే ఫోన్‌ను హ్యాక్ చేసి, ఖాతాల్లోని డబ్బులను సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్నారు. వీటికి తోడుగా న్యూడ్‌గా ఉండి వీడియో కాల్స్ చేసి, స్క్రీన్ షాట్లు తీసి, వాటినే బాధితులకు పంపించి డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు పెరిగిపోయాయి.

“ ప్రజల్లో అవగాహన పెరగాలనే ఫిర్యాదు..
సైబర్ నేరాలు, హనీ ట్రాప్, వీడియో కాల్స్ విషయంలో అమాయక ప్రజలు ఇబ్బందుల పాలు కావద్దనే తాను పోలీసులకు ఫిర్యాదు చేశాను. నేరస్తుల బెదిరింపులకు భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అప్పుడే ఇలాంటి సమస్యలు దూరమవుతాయి.
– ఎమ్మెల్యే వీరేశం

“ అప్రమత్తంగా ఉండాలి
వీడియో కాల్స్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తెలియని నెంబర్ల నుంచి వీడియో కాల్స్ వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ లిఫ్ట్ చేయవద్దు. సోషల్ మీడియా అకౌంట్లకు టూ స్టెప్ సెక్యూరిటీ, ప్రొఫైల్, అకౌంట్ లాక్ వంటివి పెట్టుకోవాలి. అప్పుడు మీ ఫ్రెండ్స్ లిస్ట్ నేరగాళ్లకు వెళ్లకుండా అడ్డుకోవచ్చు.
–సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ

రంజాన్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ త్రిపాఠి

నల్లగొండ: రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు. బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రంజాన్ సందర్భంగా మసీదుల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. విలీన గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించాలని సూచించారు. రంజాన్ రోజు పాలు ఎక్కువగా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు కోరగా, డెయిరీ డెవలప్‌మెంట్‌కు లేఖ రాస్తామని కలెక్టర్ తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ 18004251442 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఎస్పీ శరత్ చంద్రపవర్ మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకొని అంతటా పోలీస్ పెట్రోలింగ్ పెంచుతామన్నారు. పూర్తి బందోబస్తు కల్పిస్తామన్నారు.

ప్రభుత్వ సంస్థల్లోనే నీట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి
మే 4న నిర్వహించనున్న నీట్ పరీక్షకు ప్రభుత్వ సంస్థల్లోనే సెంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల ఏర్పాటు విషయమై బుధవారం ఆమె కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పట్టణంలో ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలను పరిశీలించాలన్నారు. జిల్లా నుంచి సుమారు 2,800 వరకు అభ్యర్థులు నీట్ పరీక్షలు రాసే అవకాశం ఉందన్నారు. వేర్వేరుగా జరిగిన ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ అశోక్‌రెడ్డి, శాంతి కమిటీ సభ్యులు గోలి మధుసూదన్‌రెడ్డి, ఖాజాగౌస్ మొహిద్దీన్, సలీం, రఫీక్, శౌరయ్య, ఆర్డీఓలు రమణారెడ్డి, శ్రీదేవి, జిల్లా అధికారులు, శాంతి కమిటీ సభ్యులు, నీట్ ప్రవేశ పరీక్ష నోడల్ అధికారి, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, జిల్లా డీఐఈఓ దస్రునాయక్, డీఈఓ భిక్షపతి, డీఎస్పీ రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలి



దేవరకొండ గిరిజన కళాశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సెక్రటరీ శరత్

- గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

దేవరకొండ, పెద్దవూర: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ శరత్ అన్నారు. బుధవారం దేవరకొండ మండల పరిధిలోని గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, పెద్దవూరలోని సమీకృత బాలికల వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, గ్రంథాలయాన్ని, పెద్దవూర హాస్టల్‌లో విద్యార్థులు, సిబ్బంది హాజరు పట్టికలు, వంట గదిని, స్టోర్ రూంలోని సామగ్రిని పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులంతా సమన్వయంతో పనిచేసినప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వాన్ని సహించేది లేదని, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో నర్సులను నియమించి సిక్ రూమ్‌లు ఏర్పాటు చేసి అనారోగ్యానికి గురైన విద్యార్థులకు ఎప్పటికప్పుడు ప్రథమ చికిత్స చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. మెనూ అమలు తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కలెక్టర్‌తో మాట్లాడి వచ్చే విద్యా సంవత్సరానికి పెద్దవూరలోని బాలుర ఆశ్రమ పాఠశాలను ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు మార్చి, ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను మండల కేంద్రం సెంటర్‌లో ఉన్న ఆశ్రమ పాఠశాలకు మార్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయా చోట్ల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్సీఓ బలరాం, ఏటీడీఓ ఎం.శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ హరిప్రియ, వైస్ ప్రిన్సిపాల్ శ్వేత, దేవరకొండ ఏఎస్పీ మౌనిక, వార్డెన్లు అహల్యా, కొల్లు బాలకృష్ణ కొర్ర రాంసింగ్, శ్రీనునాయక్ తదితరులు ఉన్నారు.



పెద్దవూర ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో బియ్యాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్

కాంగ్రెస్ పాలనలో రైతులకు తప్పని కష్టాలు

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ అసమర్థ పాలన కారణంగా రైతులు నానా కష్టాలు పడుతున్నారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌తో కలిసి బుధవారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి రైతులు సాగుచేసిన పంట పొలాలు కరెంట్, సాగునీరు సక్రమంగా అందక నిలువునా ఎండిపోతున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనతో పాడి, పంటలతో సంతోషంగా ఉన్న రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బీడు భూములుగా మార్చిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాలనలో రైతులు తమ పంటలను తామే కాల్చుకునే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. 50శాతం మంది రైతులకు కూడా రూ.2లక్షల రుణమాఫీ అమలు జరగలేదన్నారు. ఎండిపోయిన పొలాలకు ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నకిరేకల్ ఏఎంసీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బడుగుల శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఎ.వెంకన్న, బంటు మహేందర్, కొండ సైదులు, టి.వెంకన్న, జి.సత్యనారాయణగౌడ్, వెంకటేష్, అంజయ్య, మహేష్, పాపయ్య, సైదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, చిత్రంలో సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

134 మంది కార్యదర్శులకు చార్జి మెమోలు

- చెప్పకుండా సెలవులపై వెళ్లినందుకు జారీచేసిన డీపీఓ
- గతంలోనే 109 మందికి షోకాజ్ నోటీసులు, బదిలీ
- గైర్హాజరీల వ్యవహారంపై త్వరలోనే విచారించనున్నట్లు సమాచారం



నల్లగొండ: పంచాయతీ కార్యదర్శులకు సర్వీస్ బ్రేక్ తప్పేలా కనిపించడం లేదు. జిల్లాలో పలువురు పంచాయతీ కార్యదర్శులు ఆ శాఖకు చెందిన జిల్లా అధికారి అనుమతి లేకుండా సెలవుపై వెళ్లారు. గతంలోనే 109 మందికి నోటీసులు జారీ చేసిన పంచాయతీ అధికారి తాజాగా 134 మందికి చార్జి మెమోలు అందజేశారు.

అనుమతి లేకుండా నెలల తరబడి..
చార్జి మెమోలు అందుకున్న వారిలో కొందరు మూడు నెలలు, మరికొందరు ఆరు నెలలు, ఇంకొందరు సంవత్సరంన్నర వరకు ఎలాంటి అనుమతి లేకుండా సెలవులపై వెళ్లారు. వారంతా వివిధ రకాల పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు వెళ్లారు. తిరిగి విధుల్లో జాయిన్ అయ్యేందుకు రాగా చాలా రోజులు వారిని పెండింగ్‌లో ఉంచారు. అనుమతి లేకుండా వెళ్లినందుకు వారి సెలవుల సర్వీస్ కాలాన్ని కట్ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి వారందర్నీ గతంలో పనిచేసిన ప్రాంతాల నుంచి 109 మందిని బదిలీ చేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శులంతా కలెక్టర్‌ను కలిసి మొర పెట్టుకున్నారు. వీరిని వాస్తవంగా సస్పెండ్ చేయాలి కానీ, మానవతా దృక్పథంతో సెలవు కాలానికి సంబంధించిన సర్వీస్‌ను రద్దు చేసి వేతనాన్ని కట్ చేసేలా ఉత్తర్వులు జారీ చేసి విధుల్లోకి తీసుకున్నారు. అప్పట్లో వారందరికీ నోటీసులు కూడా ఇచ్చారు. తాజాగా చార్జి మెమోలు అందుకున్న వారందరినీ త్వరలో విచారించేందుకు ఆర్డీఓ, ఎంపీడీఓ స్థాయి అధికారులను ఒకరిని నియమించనున్నట్టు తెలిసింది. కార్యదర్శులు నిజంగా ఎలాంటి అనుమతి లేకుండా సెలవులపై నెలల తరబడి వెళ్లారని రుజువైతే వారు విధులకు గైర్హాజరైన కాలానికి సంబంధించి సర్వీస్ వేతనాన్ని కట్ చేసే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

రుజువైతే సెలవు కాలం సర్వీస్ రద్దే..
ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైనట్లు విచారణలో తేలితే ఆ కాలానికి సంబంధించి కార్యదర్శులకు సర్వీస్ బ్రేక్ చేస్తాం. దీంతోపాటు వారికి వేతనం కట్ కానుంది. త్వరలోనే విచారణ అధికారిని నియమిస్తాం.
– వెంకయ్య, డీపీఓ, నల్లగొండ

పొన్నవాహనంపై నృసింహుడు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన బుధవారం స్వామివారు మురళీకృష్ణుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రధానాలయంలో నిత్యారాధలు నిర్వహించిన అనంతరం నిత్యకల్యాణ మండపంలో స్వామివారిని మురళీకృష్ణుడిగా పల్లకిపై అధిష్ఠింపజేసి ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. ఆ తరువాత భాజా భజంత్రీలు, సన్నాయి మేళాల మధ్య మురళీకృష్ణుడికి రాగాలాపన చేశారు. సాయంత్రం ప్రధానాలయంలో సంప్రదాయ పూజలు పూర్తిచేసిన అనంతరం శ్రీస్వామి వారిని పొన్న వాహనసేవపై ఊరేగించారు. వేడుకల్లో ఈఓ భాస్కర్‌రావు, ఆలయ ధర్మకర్త నర్సింహమూర్తి, అర్చకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు
బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం గోవర్ధనగిరిధారి అలంకారం, రాత్రి సింహ వాహన సేవ ఉంటుంది.



అలంకార సేవను ఊరేగిస్తున్న అర్చకులు, ఈఓ, ధర్మకర్త

ఆకట్టుకున్న 'యువ ఉత్సవ్'

రామగిరి(నల్లగొండ): నల్లగొండ నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన యువ ఉత్సవ్ కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది. ఇందులో విద్యార్థులు, యువతకు సైన్స్‌మేళా, పెయింటింగ్, వ్యాసరచన, మొబైల్ ఫొటోగ్రఫీ, జానపద నృత్య ప్రదర్శన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి ప్రారంభించి మాట్లాడారు. యువతలోని ప్రతిభ వ్యక్తీకరణకు యువ ఉత్సవ్ మంచి వేదిక అని అన్నారు. కార్యక్రమంలో నెహ్రూ యువజన కేంద్ర జిల్లా అధికారి ప్రవీణ్‌సింగ్, ఎంకే.నాయక్, కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.సుదర్శన్‌రెడ్డి, డాక్టర్ జి.అమరావతి, డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ అరవింద, డాక్టర్ కె.సాలయ్య, డాక్టర్ మల్లీశ్వరీ, మామిడి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.




మూఢ నమ్మకాల నిర్మూలనపై నిర్వహించిన ప్రదర్శనలో విద్యార్థినులు, గిరిజన సంప్రదాయ నృత్యం చేస్తూ..

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భువనగిరి: మండలంలోని పగిడిపల్లి గ్రామ పరిధిలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పగిడిపల్లి పరిధిలోని పాత కలెక్టరేట్ భవనం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భువనగిరి ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గత వారం రోజులుగా మృతుడు భిక్షాటన చేస్తూ సంచరిస్తున్నాడని గ్రామస్తులు తెలిపారు. మృతుడి వయస్సు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుందని, వివరాలు తెలిసిన వారు 8712662472, 8712662733 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ సంతోష్‌కుమార్ సూచించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మోత్కూరు: మానసికస్థితి సరిగ్గా లేని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మోత్కూరు పట్టణ శివారులో బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. మోత్కూరు పట్టణ పరిధిలోని అంగడి బజార్‌కు చెందిన బీసు లింగస్వామి(55) మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి అతడికి మానసిక స్థితి సరిగ్గా ఉండటంలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆయన బుధవారం మోత్కూరు పట్టణ శివారులో మోదుగుచెట్టుకు కేబుల్ వైరుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య బీసు సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి. నాగరాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

నాంపల్లి: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం నాంపల్లి మండలం స్వాములవారి లింగోటం శివారులో జరిగింది. నాంపల్లి మండల కేంద్రానికి చెందిన పూల రవి(33) మర్రిగూడ మండలం వట్టిపల్లిలో నిమ్మ తోట కౌలుకు తీసుకున్నాడు. బుధవారం రాత్రి తోటలో పని ముగించుకొని తన భార్యతో కలిసి బైక్‌పై నాంపల్లికి వస్తుండగా.. స్వాములవారి లింగోటం శివారులో మూలమలుపు వద్ద అదుపుతప్పి కిందపడిపోయారు. రవి తలకు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. అతడి భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను చికిత్స నిమిత్తం మాల్‌కు తరలించారు. రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండకు తరలించారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


నర్సింహ (ఫైల్)

వేములపల్లి: లారీ బైక్‌ను ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం రాత్రి మాడుగులపల్లి మండల కేంద్రం సమీపంలో గల ఐకేపీ కేంద్రం వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడుగులపల్లి మండలం చెరువుపల్లి గ్రామానికి చెందిన వేముల నర్సింహ(36) బైక్‌పై మిర్యాలగూడకు వెళ్తుండగా హైదరాబాద్ నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న తమిళనాడుకు చెందిన లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహ తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వైద్యానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు

కనగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం కనగల్ మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి మీడియాతో మంత్రి మాట్లాడారు. కనగల్ పీహెచ్‌సీలో కంటి పరీక్షలు చేసే గ్లూకోమా సెంటర్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. అర్హులైన వారికి గడచిన 15 నెలల్లోనే రూ.1600 కోట్ల ఎల్‌ఓసీలను అందించామని, పేద ప్రజలు వైద్యం కోసం వస్తే 24 గంటలు ఎల్‌ఓసీలను అందజేస్తున్నామని అన్నారు. అయితే ప్రైవేట్ ఆస్పత్రులకు ఎల్‌ఓసీ ఇచ్చే బదులుగా ఇకపై ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అన్నిరకాల సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. హైదరాబాదులో 4 టిమ్స్ హాస్పిటళ్లను ఆర్‌అండ్‌బీ ద్వారా నిర్మిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ ఎంజీఎంను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రూ.2600 కోట్లతో హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, పాత భవనం అలాగే కొనసాగుతుందని తెలిపారు. వచ్చేవారం దేవరకొండ నియోజకవర్గంలో గ్లూకోమా కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. నల్లగొండ ఆస్పత్రిలో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్‌ను ఈ నెలాఖరుకు ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఇతర ప్రాంతాలలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న 59 మంది డాక్టర్లను వెనక్కి పిలిపిస్తున్నామన్నారు. పేద ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారానే వైద్య సేవలు అందిస్తామన్నారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ.. పైలెట్ పద్ధతిన కనగల్ పీహెచ్‌సీలో గ్లూకోమా సెంటర్‌ను ప్రారంభించామని తెలిపారు. కనగల్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ గ్లూకోమా కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రానున్న రోజుల్లో జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక మోడల్ పీహెచ్‌సీని తీర్చిదిద్దుతామని తెలిపారు. తన ప్రసవం కూడా ప్రభుత్వ ఆస్పత్రిలోనే జరిగిందని ఆమె పేర్కొన్నారు.

విత్తనాలు మార్చకుండా అవగాహన కల్పించాలి

- ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్ మధుబాబు


మాట్లాడుతున్న ప్రొఫెసర్ మధుబాబు

త్రిపురారం: వరి విత్తనాలను ప్రతిసారి మార్చాల్సిన అవసరం లేదని, రైతులు తమ పొలంలోనే పండించిన వరి ధాన్యాన్ని విత్తనాలుగా వినియోగించుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అవగాహన కల్పించాలని హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో గల ఎక్స్‌టెన్షన్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్(ఈఈఐ) ప్రొఫెసర్ డాక్టర్ మధుబాబు అన్నారు. బుధవారం త్రిపురారం మండలంలోని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ సలహా మండలి, జిల్లా స్థాయి సమన్వయ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024–25 సంవత్సరంలో శాస్త్రవేత్తలు వ్యసాయంలో రైతులకు అందించిన సలహాలు సూచనలు, అదే విధంగా 2025–26వ సంవత్సరంలో అందించే సేవలపై శాస్త్రవేత్తలు సమీక్ష చేశారు. కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు గాను సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. స్థిరమైన వరి ఉత్పత్తికి నేరుగా విత్తే పద్ధతి, ప్రకృతి వ్యవసాయం, బేకరీ ఉత్పత్తులు, వర్మీ కంపోస్ట్, కూరగాయల సాగు, కోళ్లు, గొర్రెల పెంపకం, వాటర్ మేనేజ్‌మెంట్, మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ వంటి వాటిపై శిక్షణ ఇచ్చామన్నారు. చీడపీడల నివారణకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సలహాలు, సూచనలు అందజేసినట్లు పేర్కొన్నారు. అనంతరం డాక్టర్ మధుబాబు మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతుకు అవసరమయ్యే వాటిపై నూతన ప్రయోగాలు చేయాలన్నారు. అనుభవం ఉన్న రైతుల ద్వారా సమాచారాన్ని సేకరించి ఇతర రైతులను ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయంలో రైతులు అధిక దిగుబడులు సాధించడానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు ముందుండాలన్నారు. ఈ ఏడాది రైతులకు అందించాల్సిన సేవలపై ముందస్తుగా ప్రణాళిక ఉండాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం హెడ్ అనిల్, ఏడీఆర్ సుధాకర్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రశేఖర్, రాములమ్మ, హాలియా ఏడీఏ రవీందర్, ఉద్యానవన అధికారి మురళి, పలువురు మండల వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలను ఎదుర్కోవడంపై అవగాహన


హాజరైన నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థులు, పోలీసులు


అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ

- సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీనారాయణ

నల్లగొండ: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ లక్ష్మీ నారాయణ అన్నారు. సైబర్ నేరాలపై నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్ట్, సైబర్ స్టాకింగ్, వర్క్ ఫ్రం హోం పేరుతో మనల్ని ఆకర్షితులను చేస్తూంటారని, కొన్నిసార్లు భయ భ్రాంతులకు గురిచేస్తూ మన నుంచి డబ్బులు కాజేస్తారని అన్నారు. సైబర్ క్రైంలో డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే సైబర్ 1930కి నంబర్ కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అనంతరం సమీప పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. సోషల్ మీడియా వాడకం సరైన పద్ధతిలో ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియాలో పెట్టుకోవద్దన్నారు. ఇంటర్నెట్ అనేది జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థినులు వ్యక్తిగత ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయకపోవడం మంచిదని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్‌కు స్పందించవద్దని, విద్యార్థులు బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలు, మోసాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి , నల్లగొండ వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ సైదులు, రియాజ్, మోక్షిత్, ఫారూక్, మెడికల్ కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బస్సులో పోగొట్టుకున్న పర్సు అప్పగింత

దేవరకొండ: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు పోగొట్టుకున్న పర్సును డ్రైవర్, కండక్టర్ గుర్తించి తిరిగి అతడికి అప్పగించారు. దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం హైదరాబాద్ నుంచి దేవరకొండకు వస్తుంది. ఈ బస్సులోని ప్రయాణికుడు ఒకరు పర్సు బస్సులోనే మర్చిపోయి కొండమల్లేపల్లిలో దిగిపోయాడు. బస్సులో పర్సును గుర్తించిన కండక్టర్ బుచ్చిరెడ్డి, డ్రైవర్ భోజ్యా దేవరకొండ డిపో అధికారులకు అందజేశారు. పర్సులోని వివరాల ఆధారంగా పర్సు పోగొట్టుకున్న ప్రయాణికుడిని గుర్తించి అతడికి తిరిగి పర్సు అప్పగించారు. ఆ పర్సులో రూ.14,500 నగదు ఉన్నట్లు తెలిపారు. నిజాయితీ చాటుకున్న బస్సు డ్రైవర్, కండక్టర్‌ను ఆర్టీసీ అధికారులు అభినందించారు.


ప్రయాణికుడికి పర్సు అప్పగిస్తున్న దేవరకొండ ఆర్టీసీ డిపో అధికారులు

అన్ని పంటలకు మద్దతు ధర ఇవ్వాలి


సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

భానుపురి (సూర్యాపేట): జిల్లాలో రైతులు పండించిన అన్నిరకాల పంటలకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) జిల్లా కన్వీనర్లు మల్లు నాగార్జున్‌రెడ్డి, మండారి డేవిడ్ కుమార్, షేక్ నజీర్, నల్లడ మాధవరెడ్డి, నారాబోయిన వెంకట యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా సూర్యాపేట కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పాత రుణాలు రద్దుచేసి కొత్త రుణాలు ఇవ్వాలన్నారు. నూతన వ్యవసాయ మార్కెట్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. సన్నధాన్యం పండించిన రైతులకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం నేటికీ పూర్తిస్థాయిలో అమలు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. రైతులందరికీ రుణమాఫీ అమలు చేసి రైతుభరోసా అందించాలని కోరారు. ఎస్సారెస్పీ ద్వారా సాగునీరు అందించి నూతనకల్, మద్దిరాల, ఆత్మకూరు, చివ్వెంల, మోతె, పెన్ పహాడ్, మునగాల, నడిగూడెం మండలాల రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏఓ సుదర్శన్ రెడ్డికి అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వరికుప్పల వెంకన్న, బొడ్డు శంకర్, దండ వెంకటరెడ్డి, మట్టిపల్లి సైదులు, ములకలపల్లి రాములు, పోటు లక్ష్మయ్య, పల్లె వెంకటరెడ్డి, కరీం, కందాల శంకర్ రెడ్డి, మేకల కనకారావు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో కలిసి మహిళ అదృశ్యం

- సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా అర్ధగంటలో ఆచూకీ కనిపెట్టిన పోలీసులు


పోలీసులతో నాగజ్యోతి, ఆమె పిల్లలు

కనగల్: వైవాహిక జీవితంలో గొడవల కారణంగా మనస్తాపం చెంది తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైన మహిళ ఆచూకీని అర్ధగంటలో కనగల్ పోలీసులు కనిపెట్టారు. నల్లగొండ మండలం జి. చెన్నారం గ్రామానికి చెందిన కాలం నాగజ్యోతి వైవాహిక జీవితంలో గొడవల కారణంగా జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం తన ఇద్దరు పిల్లల్ని తీసుకొని ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. జ్యోతి భర్త, తల్లిదండ్రులు చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బుధవారం సాయంత్రం కనగల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ విష్ణుమూర్తి పోలీసులను రెండు టీంలుగా విభజించి దర్యాప్తు చేస్తున్న క్రమంలో నాగజ్యోతి అన్న మొబైల్‌కు కొత్త నంబర్ నుంచి నాగజ్యోతి ఫోన్ చేసి ×నేను చనిపోతున్నాను. నా గురించి ఎవరూ వెతకొద్దు, నేను పిల్లల్ని తీసుకొని చనిపోతున్నాను౯ అని చెప్పి ఫోన్ కట్ చేసింది. ఈ విషయం ఆమె అన్న వెంటనే కనగల్ పోలీసులకు చెప్పడంతో ఆ నంబర్‌ను ట్రేస్ చేసి నాగజ్యోతి హైదరాబాద్‌లో ఉందని నిర్ధారించుకొని హయత్‌నగర్ పోలీసుల సహకారంతో నాగజ్యోతి ఆచూకీని అరగంటలో కనిపెట్టి ఆమెను క్షేమంగా వారి బంధువులకు హయత్‌నగర్‌లో అప్పగించారు. నాగజ్యోతి బంధువులు కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీపై రాజకీయ పోరాటం చేయాలి

- బీజేపీ విధానాలను ఎండగట్టడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ విఫలం
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

మిర్యాలగూడ అర్బన్: రాష్ట్రానికి ప్రమాదకరంగా మారబోతున్న బీజేపీ విధానాలను ఎండగట్టడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విఫలమయ్యాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం ఆయన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాయమాటలతో, మతోన్మాదంతో ప్రజలను రెచ్చగొట్టి ఎన్నికల్లో గెలుపొందాలని బీజేపీ చూస్తోందని, దీనికి ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో బీజేపీని కాంగ్రెస్ పార్టీ అడ్డుకోలేక పోతోందని విమర్శించారు. భవిష్యత్తులో బీజేపీపై రాజకీయ యుద్ధం జరగాల్సిన అవసరం ఉందన్నారు. రాజస్తాన్‌లో ఓ చిన్న కేసు విషయంలో పోలీసులు అర్ధరాత్రి ఇంట్లో చొరబడి ఆరునెలల చిన్నారి చావుకు కారణం అయ్యారని, ముస్లిం వ్యతిరేకంగా పాలన చేయడమే ఆ పార్టీ లక్ష్యమన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేడం లేదని విమర్శించారు. కేవలం బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ పైనే ఏదో గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. 50శాతం రిజర్వేషన్ దాటవద్దని సుప్రీంకోర్టు చెపుతున్నా.. పార్లమెంట్‌లో బీసీ కులగణన ఆమోదం పొందదనే దృష్టితోనే బీసీ కులగణన చేసినట్లు చెప్పుకుంటున్నారని అన్నారు. ఇదంతా రాష్ట్ర ప్రభుత్వ నాటకమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ఖమ్మం, నల్లగొండ జిల్లాల కార్యదర్శులు నూనె నాగేశ్వర్‌రావు, తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, డబ్బికార్ మల్లేష్, సయ్యద్ హాశం, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, ఎండీ సలీం, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, మల్లయ్య, అరుణ, పల్లా భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం దురదృష్టకరం

ప్రభుత్వ వైఫల్యం కారణంగానే ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జరిగిందని భావిస్తున్నామని, సొరంగమార్గం తవ్వేటప్పుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదని విమర్శించారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ప్రభుత్వం తీరు ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సొరంగం పనులు పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు.

'పెద్దగట్టు' హుండీ ఆదాయం లెక్కింపు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

చివ్వెంల(సూర్యాపేట): చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని లింగమంతులస్వామి(పెద్దగట్టు) ఆలయ హుండీ ఆదాయాన్ని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. పెద్దగట్టు జాతర ఫిబ్రవరి 20వ తేదీన ముగియగా.. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 5 వరకు వచ్చిన హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 13 రోజులకు గాను రూ.5.24 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె. భాస్కర్, ఇన్‌స్పెక్టర్ బి. సుమతి, ఆలయ కమిటీ చైర్మన్ పోలేబోయిన నర్సయ్యయాదవ్, ఈఓ కుశలయ్య, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో వింత జంతువు ప్రత్యక్షం


చెట్టుపై ఉన్న నల్లని జంతువు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లో బుధవారం వింత జంతువు ప్రత్యక్షమైంది. పట్టణంలోని శ్రీమన్నారాయణ కాలనీలో నివాసముంటున్న రఫీ ఇంట్లో మామిడి చెట్టుపై నల్లని వింత జంతువు కనిపించడంతో ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నరసింహారావు వచ్చి ఆ జంతువును పరిశీలించి దానిని సీవీఎట్ క్యాట్‌గా పిలుస్తారని చెప్పారు. ఇది మనుషులకు హాని చేయదని, అడవుల్లోనే రాత్రివేళ ఎక్కువగా సంచరిస్తుందని పేర్కొన్నారు.

200 టేకు చెట్లు దగ్ధం

ఆత్మకూరు(ఎం): గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో టేకు చెట్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండలం రాయిపల్లిలో మంగళవారం రాత్రి జరిగింది. రాయిపల్లి గ్రామానికి చెందిన జెట్ట శ్రీనివాస్ వ్యవసాయ భూమిలో సుమారు 350 టేకు చెట్ల ఉన్నాయి. ఈ టేకు చెట్లకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో 200 చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మోత్కూరు నుంచి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేశారు. సుమారు రూ.2.50లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు బుధవారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కొనసాగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. బుధవారం హైదరాబాద్‌లోని కార్వాన్‌కు చెందిన శ్రీవిశ్వాంజనేయ భక్త సమాజం, యాదగిరిగుట్టలోని యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి మహిళా భజన మండలి, వేల్పుపల్లి శివరామకృష్ణ భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా హైదరాబాద్‌కు చెందిన మసన చెన్నప్ప ఆధ్వర్యంలో ఉపనిషత్ వైభవంపై ఉపన్యాసం చేశారు. హాలియాకు చెందిన చేబ్రోలు నారాయణదాసు సమక్షంలో సుభద్రా పరిణయం హరికథ గానం చేశారు. స్వరరాగ ఆర్ట్స్ ఆకాడమీ ఆధ్వర్యంలో భక్తి సంగీతం, మెరుగు రాఘవేంద్రచే తబలా వాయిద్యం చేపట్టారు. సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు ప్రముఖ జానపద, సినీ నేపథ్య గాయని తేలు విజయ ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమం కొనసాగింది. ఇక పలువులు కళాకారులు కూచిపూడి, భరత నాట్యం, సాంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు.


ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తున్న సినీ నేపథ్య గాయని తేలు విజయ బృందం

ప్రశాంతత కోసం బుద్ధవనాన్ని సందర్శించాలి

- జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యదర్శి ఆర్‌కే మిశ్రా


బుద్ధవనంలో బుద్ధుడి పాదాల వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఆర్‌కే మిశ్రా తదితరులు

నాగార్జునసాగర్: జీవితం ప్రశాంతంగా ఉండాలంటే ప్రతిఒక్కరూ బుద్ధవనాన్ని సందర్శించాలని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ కార్యదర్శి ఆర్‌కే మిశ్రా అన్నారు. నల్లగొండ జిల్లాలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఆపద మిత్ర శిక్షణ కార్యక్రమాలను పర్యవేక్షించడానికి వచ్చిన ఆయన బుధవారం నాగార్జునసాగర్ తీరంలోని బుద్ధవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బుద్ధవనంలోని బుద్ధుడి పాదాల చెంత పుష్పాంజలి ఘటించారు. అనంతరం బుద్ధచరిత వనం, ధ్యానవనం, స్థూపవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. మహాస్థూపంలోని అష్టబుద్ధుల వద్ద ధ్యానం చేశారు. అనంతరం నాగార్జునసాగర్ డ్యాంను సందర్శించారు. ఆయనకు బుద్ధవనం చరిత్ర గురించి గైడ్ సత్యనారాయణ వివరించారు. వారి వెంట డీఆర్‌డీఏ ఏపీడీ శేఖర్‌రెడ్డి, పెద్దవూర మండల తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఆపద మిత్ర ప్రోగ్రాం శిక్షకులు తదితరులు ఉన్నారు.

'సిరిపురం' పర్సన్ ఇన్‌చార్జ్‌గా రామేశ్వరం


నియామక పత్రాలు అందుకుంటున్న సిరిపురం చేనేత సహకారం సంఘం పర్సన్ ఇన్‌చార్జ్, పాలకవర్గ సభ్యులు

రామన్నపేట: మండలంలోని సిరిపురం చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్‌గా అప్పం రామేశ్వరం, పాలకవర్గ సభ్యులకు బాధ్యతలను అప్పగించారు. ఈ మేరకు బుధవారం రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, జిల్లా చేనేత జౌళిశాఖ ఇన్‌చార్జ్ సహాయ సంచాలకురాలు పద్మ నియామక పత్రాలు అందజేశారు. సిరిపురం సొసైటీ ఉమ్మడి జిల్లాలోనే బెడ్‌షీట్లు, డ్రెస్ మెటీరియల్ ఉత్పత్తిలో పేరుగాంచింది. జిల్లాలో పదవీకాలం ముగిసిన మిగతా సొసైటీల చైర్మన్లకు పర్సన్ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించగా, 2018లో కొంతమంది ఫిర్యాదు మేరకు సిరిపురం సొసైటీ బాధ్యతలను చేనేత జౌళిశాఖ డెవలప్‌మెంట్ అధికారికి అప్పగించారు. తాజా ఉత్తర్వుల మేరకు సిరిపురం చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జ్‌గా అప్పం రామేశ్వరం మరియు పాలకవర్గ సభ్యులు గురువారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉత్తర్వులు అందుకున్న వారిలో పర్సన్ ఇన్‌చార్జ్ అప్పం రామేశ్వరం, ఉపాధ్యక్షురాలు రాపోలు లక్ష్మమ్మ, ప్రధాన కార్యదర్శి జెల్ల లక్ష్మీనారాయణ, కోశాధికారి ఏలె నరసింహ, కార్యవర్గ సభ్యులు రాపోలు రమేష్, గుండు రాజు, రాపోలు పాపయ్య, సంగిశెట్టి వెంకటమ్మ, అప్పం శ్రీను, రాపోలు శ్రవణ్‌కుమార్ ఉన్నారు.